చూసిన కనులదే భాగ్యమట..

- అత్యంత వైభవంగా ఎల్లమ్మ జాతర
- పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

ఎంతో ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన ఎల్లమ్మ జాతరకు ఆదివారం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లమ్మ తల్లి ప్రాశస్త్యం ఎంతో పురాతనమైదని చరిత్రకారులు చెబుతారు. మన దేశానికి బ్రిటిష్ పాలకులు రాక ముందు నుంచే ఇక్కడి స్థానికులు ఈ అమ్మవారిని పూజించే వారని తెలుస్తుంది. చిత్రాలయ థియేటర్ సమీపంలో కొన్నేళ్ల కిందట ఓ బావిలో ఎల్లమ్మ వారు, సోదరుడు పోతురాజు విగ్రహాలు బయల్పడ్డాయి. విగ్రహాలను బయటకు తీసి, మామిడి చెట్టు ఉన్న తోటలో ప్రతిష్టించారు. 1960లో సంభవించిన తుపానుకు ఆలయం కూలిపోయింది. అనంతరం నూతన ఆలయాన్ని నిర్మించారు. తదనంతర కాలంలో ఈ అమ్మవారి పేరిట ఈ ప్రాంతానికి ఎల్లమ్మ తోట అనే పేరు స్థిరపడింది. మహా శివ రాత్రి పర్వదినం రోజున సముద్ర స్నానం చేసి ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుంటే సర్వ రోగాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.



ఎల్లమ్మ అమ్మవారిని తోడ్కొని వెళ్తున్న భక్తులు



ఎల్లమ్మ తల్లి జాతరలో పాల్గొన్న జన సందోహం

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం ఎల్లమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. జగదాంబ జంక్షన్ వద్ద వెలసిన ఆలయంలో వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. అమ్మవారితో పాటు ఆమె సోదరుడు పోతురాజుకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు, దేవదాయ శాఖ అధికారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఎల్లమ్మతోట, చాకలిపేట, కనకలవీధి, కుమ్మరవీధి, దిబ్బలపాలెం, ప్రకాశరావుపేట, మహారాణిపేట, అంగటిదిబ్బ, డాబాగార్డెన్స్, సూర్యాబాగ్, బొడ్డునాయుడు తోట, లలితానగర్ తదితర ప్రాంతాలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, భీమిలి, కొత్తవలస తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. జాతరను పురస్కరించుకుని ఆలయ పరిసర ప్రాంతాలు విద్యుద్దీపాలతో అలంకరించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వర థియేటర్ సమీపంలో ఉన్న ఎల్లమ్మ తల్లి పుట్ట వద్ద మాలధారులు శూలాల ప్రదర్శన చేపట్టారు. అగ్నిగుండం తొక్కారు. అమ్మవారి దర్శనం కోసం ఎల్లమ్మ గుడి నుంచి జగదాంబ జంక్షన్ వరకు క్యూలైన్లు బారులు తీరాయి. ఎల్లమ్మ అమ్మవారి పుట్ట, సోదరుడు పోతురాజు పుట్ట వద్ద కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, మొక్కులు సమర్పించుకున్నారు. టూటౌన్, మహారాణిపేట పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. పలు స్వచ్ఛంద సంస్థలు ప్రసాదం పంపిణీ చేశాయి. ఆలయ ఈవో కె. పద్మావతి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తొలేళ్లతో ప్రారంభం..

మహాశివరాత్రి తర్వాత తొమ్మిదో రోజు మృగశిర నక్షత్రాన అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారి జాతర ముందు రోజున(శనివారం) అర్ధరాత్రి దాటిన తర్వాత వన్‌టౌన్ జిల్లెలమూడు వీధిలోని జొన్నాడ గురుమూర్తి ఇంట్లో ఉన్న చదును పట్టు వద్ద ఎల్లమ్మ అమ్మవారు, సోదరుడు పోతురాజుకు పప్పు, బియ్యం, ఉలవలతో ఉపారం పెట్టి అక్కడి నుంచి మేళతాళాలతో అమ్మవారిని తీసుకొచ్చారు.



ఎల్లమ్మ అమ్మవారు, పోతురాజు

కనుల పండువగా రేణుక యల్లమ్మ జాతర..

కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ వార్షిక జాతర మహోత్సవం ఆదివారం కనుల పండువగా సాగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. పోలేరమ్మ హుండీ నుంచి కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్, కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి, 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ గౌరవ అధ్యక్షుడు పీల అప్పలనాయుడు, అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, ఆలయ కార్యవర్గ సభ్యులు ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. అచ్చియ్యమ్మపేట, అల్లిపురం, యాతపేట, కొబ్బరితోట తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



రేణుక యల్లమ్మ అమ్మవారు



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మంచు శివలింగం, దుర్గమ్మ విగ్రహాలు

క్లుప్తంగా

ఎర్నిమాంబకు అష్టమి పూజలు



ఎర్నిమాంబ అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్

కంచరపాలెం : కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 దర్శనాలు కల్పించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ లండ రమణ, సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, జోజిబాబు, కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

కనకమహాలక్ష్మి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



ఆలయ పర్యవేక్షకుడు తిరుపతికి విరాళం అందజేస్తున్న చల్లా సుధారాణి కుటుంబ సభ్యులు

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ అభివృద్ధికి తెలంగాణకు చెందిన చల్లా సుధారాణి రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ పర్యవేక్షకుడు టి. తిరుపతికి ఆదివారం విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు.

నేతల విగ్రహాలకు ముసుగులు



నక్కవానిపాలెంలో ముసుగులు వేసి ఉన్న విగ్రహాలు

సీతమ్మధార: ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది సీతమ్మధార, నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, గురుద్వారా, అల్లూరి సీతారామరాజు జంక్షన్ తదితర ప్రాంతాల్లోని రాజకీయ నాయకుల బ్యానర్లు, ఫొటోలను తొలగించారు. పలు నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించారు. జాతీయ నాయకులు మినహా మిగిలిన అన్నింటికీ ముసుగులు వేశారు.

అలరించిన సంగీత విభావరి



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

సీతంపేట: స్వర సాగర్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో రాధాకృష్ణ శీర్షికన మూడు గంటల పాటు నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను సంగీత సాగరంలో ముంచెత్తింది. గాయకుడు సింగ్ సంగీత దర్శకత్వంలో నగరానికి చెందిన గాయనీ గాయకులు కె.ఎల్.రావు, లోకేష్, రామ్‌కుమార్, పట్టెం వెంకటేష్, రాధారాణి, మంజుల, సుజాత, రంజిత, రేణుక, లావణ్య గీతాలు ఆలపించి శ్రోతలను అలరించారు.

అమ్మవారి ఆలయంలో ముగిసిన ఉత్సవాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 33వ వార్డు పరిధిలో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శివరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ బోర విజయలక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు అభినందనలు



ప్రిన్సిపాల్ మంజులను అభినందిస్తున్న అధ్యాపకులు

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఆర్. మంజులను పలువురు అధ్యాపకులు అభినందించారు. కళాశాల అభివృద్ధికి, విద్యార్థులకు మంచి బోధన అందించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా కొనసాగిన డాక్టర్ ఎస్. శోభారాణి రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆమె స్థానంలో భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన మంజులను ఇక్కడ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సద్గురు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



షిర్డీ సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ కూడలి వద్ద సద్గురు సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పచ్చని పందిరితో అలంకరించారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గైడపాటి విక్టర్, తదితర నాయకులు.. స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యులు అన్నసమారాధన చేపట్టారు. సాయంత్రం స్వామికి పల్లకి సేవ, సంధాకచ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

'మహనీయుల త్యాగం వృథా కానివ్వం'



1130వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఎందరో మహనీయుల త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనివ్వబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1130వ రోజుకు చేరుకున్నాయి.

దీక్షలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులతో పాటు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలని ప్రకటించడం కార్మికుల జీవితాలతో ఆడుకోవడమే అన్నారు. ఇన్ని రోజులుగా కార్మికులు విశాఖ ఉక్కును గురించి పోరాడుతున్నా ప్రధాని నరేంద్రమోదీ స్టీల్‌ప్లాంట్ విషయం ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. లక్షల మందికి ప్రత్యక్షంగా, మరెంతో మందికి పరోక్షంగా ఉపాధిని కల్పిస్తున్న విశాఖ ఉక్కును నష్టాల పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం అన్యాయమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం
- పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి



ఆర్పీ పేట హైస్కూల్‌లో సిద్ధమైన తరగతి గది



టెన్త్ విద్యార్థులతో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: ఈ నెల 18వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి ఫైనల్ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. కంచరపాలెం, ఐటీఐ కూడలి పరిధి రామ్మూర్తిపంతులుపేట, కప్పరాడ, భాష్యం, శ్రీచైతన్య, రామకృష్ణ తదితర ఉన్నత పాఠశాలల పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, డీవోలు తెలిపారు. తరగతి గదుల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. విద్యార్థులు నిబంధనలు, సమయపాలన పాటించాలని అధికారులు కోరారు. పరీక్ష సమయం కంటే అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

విద్యార్థులు రెడీ..

జ్ఞానాపురంలోని సేక్రెడ్‌హార్ట్ బాలికోన్నత పాఠశాల, జూబ్లీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, ఐటీఐ కూడలిలోని కప్పరాడ ఉన్నత పాఠశాల, కరాసలోని స్టెల్లామేరీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఎన్ఏడీ కొత్తరోడ్డులోని రామకృష్ణ పబ్లిక్ స్కూల్, ఎన్ఏడీ శ్రీచైతన్య స్కూల్, ఆర్పీ పేట జీవీఎంసీ ఉన్నత పాఠశాల, కప్పరాడ ఉన్నత పాఠశాలల నుంచి పరీక్షలు రాసేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని హెచ్‌ఎంలు ఆర్.శ్రీనివాసరావు, వి.విజయమాలిని తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ సూచించారు. కంచరపాలెం గౌరీనగర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో టెన్త్ విద్యార్థులకు ఆయన ఆల్ ది బెస్ట్ చెప్పారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసి, మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తుకు మంచి పునాది పదో తరగతని చెప్పారు. టెన్త్ పరీక్షల్లో 10/10 మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే మంచి ప్రోత్సాహకాన్ని అందిస్తానన్నారు. అనంతరం టెన్త్ విద్యార్థుల పరీక్ష సామగ్రిని సతీష్ పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాయిత పైడి రత్నాకర్ యాదవ్, నమ్మి జ్యోతేష్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలు రాయనున్న విద్యార్థుల వివరాలు

పరీక్షా కేంద్రం	విద్యార్థుల సంఖ్య
ఆర్పీ పేట ఉన్నత పాఠశాల	168 మంది
కప్పరాడ ఉన్నత పాఠశాల	170 మంది
జ్ఞానాపురం సేక్రెడ్‌హార్ట్ పాఠశాల	210 మంది
జూబ్లీ ఇంగ్లిష్ మీడియం స్కూల్	198 మంది



ఐటీఐ కూడలిలోని కప్పరాడ సెంటర్



కప్పరాడ పాఠశాలలో టేబుల్‌పై హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

144 సెక్షన్ అమలు

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధార హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాటు చేసినట్టు హెచ్‌ఎం హేమలత తెలిపారు. 154 మంది టెన్త్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. ఫ్యాన్‌లు, లైట్లు వంటి సౌకర్యాలు స్కూల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ విధిస్తునట్టు కంచరపాలెం ఐదో పట్టణ సీఐ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత



జూలో పిచ్చుకల కోసం ధాన్యం కుంకులతో క్యూరేటర్ నందనీ సలారియా తదితరులు



చెట్టుకు ధాన్యం కుంకులు కడుతున్న బాలిక

ఆరిలోవ: ప్రకృతిలో పిచ్చుకలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం హరిత వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూ సందర్శకులకు పిచ్చుకలపై అవగాహన కల్పించారు. అనంతరం జూలో పలు చోట్ల చెట్లకు పిచ్చుకల ఆహారం కోసం ధాన్యం కుంకులు కట్టారు. ఈ సందర్భంగా క్యూరేటర్ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో పరిస్థితులు వల్ల పిచ్చుకల జాతి అంతరించిపోతుందన్నారు. అక్కడక్కడా కనిపించే వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రకృతిలో అన్ని జాతుల జీవులను రక్షించుకుని జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్ పాలవలస గోపాలనాయుడు, ఎఫ్ఎస్‌వోలు, సిబ్బంది, హరిత వికాస్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్పెషల్ యోగా థెరపీ తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నుంచి నుంచి ప్రత్యేక యోగా థెరపీ తరగతులు నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాలబాలికలకు పోషకాహారం పంపిణీ



పోషకాహారం అందిస్తున్న ప్రమీల తదితరులు

మురళీనగర్: మురళీనగర్‌లో బాక్సింగ్ సాధన చేస్తున్న చిన్నారులకు ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల ఆధ్వర్యంలో ఆదివారం పోషకాహారం పంపిణీ చేశారు. 65 మంది బాలబాలికలకు గుడ్లు, అరటిపండ్లు, మజ్జిగ, చాక్‌లెట్లు, బిస్కెట్లు అందించారు. కార్యక్రమంలో మురళీనగర్ రెసిడెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వాకర్స్ డిస్ట్రిక్ట్-101 ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, బాక్సింగ్ కోచ్ చౌదరి, మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, క్లబ్ ఉపాధ్యక్షులు పి.గిరిధర్, నాగేశ్వరరావు, కార్యదర్శి నిర్మల, సంయుక్త కార్యదర్శి పి.సతీష్ కుమార్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ, వైభవంగా నిత్య కల్యాణం నిర్వహించారు.